# జీవన వాహిని

తన మానానా తాను వెళ్ళిపోయే మా ఊరి గోదారికి శాంత గోదారన్న పేరుంది. కాలవ వొడ్డునుండే కొబ్బరి చెట్లు ఆకాశంలోకి, చేతులు చాపుతూ చొచ్చుకుపోతూంటే నా హృదయంలోకి చొచ్చుకుపోయినట్లుగా అనిపించేది. ప్రతీ ఉదయం, కొబ్బరాకుల నృత్యం, గోదారి మీదనుంచి వీచే గాల్లోని సంగీతం తన్మయత్వంలో అనుభవించడం అలవాటయిపోయింది. ప్రతీ నిశ్శబ్ద రాత్రి, నన్ను నక్షత్రాలన్నీ ఉత్సాహంగా కిందకి చూస్తుంటే, ఆ నీరవనిశీధి ఏదో ఓంకార మంత్రాన్ని ఉపదేశిస్తున్నట్లుగా అనిపించేది.

అలాంటిది ఈ రోజున... సుళ్ళు తిరుగుతూ వడి వడిగా, అలజడితో, హడావుడిగా, అటూ యిటూ చూడకుండా, దగ్గరికొచ్చిన ప్రతీదాన్ని అక్కున చేర్చుకుంటూ, పెద్ద శబ్దం చేస్తూ పల్లం వైపుగా, సముద్రంలో కలిసిపోడానికి తొందరపడిపోతోంది వరద గోదారి.

భయంకరంగా ఉన్న నీటి ధ్వని, రుద్ర తాండవం చేస్తున్న కొమ్మలు, కొబ్బరాకులు, సగం సగం మునిగిన చెట్లు, యిళ్ళలోకి చేరిపోయిన నీరు, అయోమయంగా సహాయం. కోసం, చూస్తున్నాం అందరం.

ఓ పడవ మా వీధిలో వాళ్ళని ఎక్కించుకుని మా యింటి ముందు ఆగింది.

"నేను యింటిని కనిపెట్టుకుని ఉంటాను, మీరంత వెళ్ళండి" అన్న నాన్న కేసి దిగాలుగా చూసాను.

వాలంటీర్ల సాయంతో, నేనూ, అమ్మ పడవని ఎక్కాం.

జాగ్రత్తమ్మ... వొట్టి మనిషివి కూడా కాదు... రా......ఇలారా.... ఇలా మధ్యలో నుంచో. ఇదిగో... ఈ శాలువాని, చెవుల మీదుగా వేసుకో......" అంటూ, పక్కింటి సూరమ్మత్తయ్యా, తన శాలువాని నా తలమీద నుంచి, చెవులు

కప్పుతూ నా భూజాల మీద సర్దింది.

బొమ్మలా నుంచున్నాను. ఆమె శాలువాని సర్దుతుంటే అభ్యంతర పెట్టలేదు. ఏం జరుగుతోందో గ్రహించలేని స్థితినాది.

మరో పది నిమిషాలకి మా ఊరి హైస్కూల్లోకి వెళ్ళాం. చిన్నప్పుడు ఇక్కడ చదువుకుంటే, ఇప్పుడు జీవిత ప్రమాణాల్ని దేవుడు బోధిస్తుంటే, నిశ్శబ్దంగా వినడానికి అడుగుపెట్టాను.

ఓ క్లాసు రూములో ఓ బెంచి మీద వాలాను. అమ్మ ఓ ప్లాస్టిక్ సంచీలో నాలుగు సింథటిక్ చీరలు జాకెట్లు పెట్టింది. నలుగురాడవాళ్ళు అడ్డంగా ఉంటే, బట్టలు మార్చుకున్నాకా, కిటికీ దగ్గరగా కుర్చీ లాక్కుని కూచుని బయటికి చూస్తున్నాను.

మూడు రోజుల్నించి పడుతున్న వర్షం. జీవితాల్ని అతలా కుతలం చేసింది.

ఏడుపులు, అరుపులు, గట్టిగా వినపడ్తున్న మాటలు ఏవీ నా ఆలోచనకి అడ్డు కాలేదు. ఆటంకం కలిగించడం లేదు.

కర్రలు కంపలు, పశువులు, మనుషులు, ఆకులు, ప్లాస్టిక్ సామాన్లు, నానా చెత్త గడ్డి అన్నీ నీళ్ళ మీద తేలిపోతున్నా, స్పందన పోయిన మర బొమ్మలా చూస్తుంటే...... జీవితంలోని వైరాగ్యం నా మనసుని తాకలేదు.

కారణం... అంతకన్నా భయంకరంగా మునిగిపోవడానికి సిద్ధంగా ఉన్న జీవితం మీద బెంగ, భవిష్యత్తు మీద బెంగ. కడుపులో ఊపిరి పోసుకుంటున్న జీవి మీద బెంగ... కారణం... షికాగోలో ఉన్న నా భర్త సురేంద్ర.

"నీ పెళ్ళికి, ఓ ఎకరం కొబ్బరి తోట యిచ్చారు. దాని మీద అయివేజు అక్కర్లేదు కానీ, అదమ్మి డబ్బు పట్రా. ఫోన్లో చెప్పడం యిష్టం లేకపోతే, పర్సనల్‌గా వెళ్ళితే... ఏం ఏఁవంటావ్?

ఏఁవంటాను?

పెళ్ళయ్యి ఏడాది కూడా కాకుండానే.క పసుపు కుంకుమల కింద యిచ్చిన పొలాన్ని అమ్మి డబ్బివ్వమని ఎలా అడగాలి? నా మొగుడు డబ్బు మనిషి, నా కన్నా, పొలాన్నే యిష్టపడ్డారని ఎలా చెప్తాను?

అంతేనా! మూడో సంవత్సరం చదువుతున్న, కాబోయె ఇంజనీరు అయిన పెద్ద తమ్ముడు, రాజమండ్రిలో ఇంటరు రెండో సంవత్సరం చదువుతున్న రెండో తమ్ముడు... కళ్ళ ముందు కనిపిస్తూంటే, సురేంద్ర కోరిక మసకబారుతోంది.

"ఒకవేళ, నేను పొలం అమ్మి డబ్బు తేనంటే....."

వికృతంగా నవ్వాడు.

"ఆ పని నీకు చాతకాదులే... నువ్వు వెళ్తావు, మీ వాళ్ళని అడుగుతున్నావు... వాళ్ళు యిస్తున్నారు... అందుకే, నువ్వు ఇండియా వెళ్ళడానికి మాత్రమే టిక్కెట్టు కొంటున్నాను. డబ్బు తెస్తే... రా... లేకపోతే రావక్కర్లేదు. నువ్వు చిన్నపిల్లవి కాదు. మీ వాళ్ళు అమాయకులు కారు......"

ఏం చేయాలో ఆలోచించడానికి రెండురోజులు పట్టింది. పరాయి వాళ్ళతో నా సమస్య చెప్పుకోడం బావుంటుదా! బావుండదా! ఆఖరికి చెప్పడానికే నిశ్చయించుకున్నాను.

గీత...... మా ఊరి అమ్మాయి. నాకన్నా ఓ పదేళ్ళ ముందే అమెరికాకి వచ్చింది. దూరపు చుట్టరికం కూడా ఉంది. ఇది వరకు అంత దగ్గర కాకపోయినా, అమెరికా వచ్చాక నాకు చాలా దగ్గరయింది.

"ఒక్కసారి వస్తావా! ఓ ఓదార్పు మాట నీ నుంచి కావాలి. జీవితంలోని నాలుగు రోడ్ల కూడలిలో నుంచున్నాను. కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న జీవితాన్ని, చేతుల్తో ఎంత వరకూ నిలబెట్టగలనో నాకు తెలీడం లేదు......."

"అర్థం అయింది శ్రావ్యా! పూర్తిగా అర్థం చేసుకున్నాను. దేశంకానీ దేశంలో, ఓ చిన్న ఓదార్పు మాట, ధైర్యం యివ్వడానికి, భుజం కావాలి! ..... ప్రవీణకి గాజులు పెడ్తున్నారుట. ఎల్లుండి శనివారం రమ్మనమని అంది. అందుకని శాన్‌హోసే వస్తున్నాను. అక్కడి నుంచి మీ యింటికొస్తాను... శనివారం పొద్దున్నే

నీ దగ్గరికి వస్తున్నాను. అంతవరకు ధైర్యంగా ఉండు......"

అన్నట్లుగానే శనివారం పొద్దున్నే వచ్చింది.

"సంసారం అన్నాక, మంచి ఉంటుంది. చెడు ఉంటుంది. కష్టం ఉంటుంది. సుఖం ఉంటుంది. ఇక్కడే, ఇలాంటి సమయంలోనే, ఇబ్బందులు, స్పర్ధలు ఎదురవుతూంటాయి. నువ్వు చదువుకున్నదానివి. అర్థం చేసుకోవాలి మీా పరిస్థితిని........"

"ఆ మాత్రం నాకు తెలీదా గీతా! నేనేం చిన్న పిల్లని కాదుకదా! కానీ, జీవితం దుర్భరం అయిపోతూంటే... మంచికి చెడుకి, కష్టానికి సుఖానికి మధ్య నున్న దూరాన్ని చూస్తుండడం మినహా ఏం చేయలేకపోయాను. ఓ మంచు దిమ్మలా అయిపోయాను.........."

నా తల ఎత్తి, కళ్ళల్లోకి చూసింది.

"ఏం జరుగుతోంది? కలహాలా!... ఒకవేళ అదే అయితే... సహజం... పోట్లాటలు, గొడవలు, ఘర్షణలు లేని కాపురాలుంటాయని నేననుకోను. అంత ఆదర్శ దంపతుల్లాగ ఉండేవాళ్ళు చాలా తక్కువ......"

"హుఁ... నేనంత ఆశకి పోలేదు... కలహాలు... తాత్కాలిక ఉండే ప్రణయ కలహాలే అవుతె... నీ సాయ అడిగేదాన్ని కాదు... ఇది వేరే రకం... పిల్లి, ఎలుక మధ్యలాంటిది, శతృవులు మధ్య ఉండే లాంటిది మా మధ్య ఉన్నది అలాంటి వాతావరణం....."

"మొదట్లో యిలాగే ఉంటాయిలే కాపురాలు. తర్వాత్తరవాత అన్ని అవే సద్దుకుంటాయి. మొగుడూ పెళ్ళాలు వేరే వేరే వాతావరణాల్లోంచి, వేరే కల్చర్ నుంచి వచ్చినవాళ్ళు. ఓ విధంగా గ్రహాంతర వాసులనుకో నీకు తెలీదా, మెన్ ఆర్ ఫ్రం మార్స్, విమెన్ ఆర్ ఫ్రం వీనస్ అని అంటారని...... ఒకళ్ళ నొకళ్ళు అర్థం చేసుకుని, సుఖంగా కాపురం చేయడానికి సమయం పడ్తుంది. రోజులు కావచ్చు. నెలలు కావచ్చు....."

దాని మాటలు పూర్తి చెయ్యనియ్యలేదు.

"అసలు అర్థం కాకుండానే జీవితం వెళ్ళిపోతేనో....... మా సంబంధానికి పునాది ఏంవిటో నాకు తెలీడం లేదు. అన్ని విధాలుగా, అని విషయాల్లో, అన్ని కోణాల్లోనూ సురేంద్ర యజమాని... ఆ ఆధిపత్యానికి నా సహనం బలి అయిపోతోంది.

నాకు తెలీకుండా, నా జీవితంలోని క్షణాలన్నీ కూడా చిందర వందరగా అయిపోతున్నాయి. ఆలోచించి, ఆలోచించి, నానా చెత్తతో, నా మెదడంత నిండిపోతోంది.

పెళ్ళికి ముందువరకూ ఉన్న అమాయకత్వం, ఆర్ద్రత నన్ను వదిలేసాయి. జీవితంలో మిగిలిందేంవిటో తెలీదు...

ట్రాజెడీ ఏంవిటో తెలుసా! నేను చదువుకున్నదాన్ని అన్న సంగతే మర్చిపోయాను. నేను పాడగలను అన్నది ఏనాడో మర్చిపోయాను. మన ఊళ్ళో ఉన్న ఈ పసిఫిక్ సముద్రం ఒడ్డున పడి ఉన్న రాయిలా, దుమ్ము ధూళికి మాసిపోతూ, నురగలకి కొట్టుకుంటూ, స్థబ్దంగా అయిపోయాను. ఈ పెళ్ళి నాకేం మిగిల్చిందో... హఁ ... అసలేం మిగల్చలేదు."

నా మీద చేయివేసి నిమిరి, లేచి, ఓ గ్లాసులో మంచి నీళ్ళు తెచ్చి నా ముందు పెట్టింది. నీళ్ళు తాగాను.

"మనం ఊహించుకున్నట్లుగా జీవితం ఉండదు. నీ ఒక్కదానికే కాదు. ఎవరికైనా అంతే ఒక్కసారి, కొంచెం ఓపిగ్గా నీ చుట్టూ ఉన్న వారిని పరిశీలించు నీలాంటి వాళ్ళ చాలా మంది కనిపిస్తారు. ఏదో అసంతృప్తి ఎక్కడో వెలితి.

ఇక్కడ చాలా మందివి ఏదో కన్వీనియన్స్ మీద నడుస్తున్న బతుకులే.

ఓ ముసుగు తొడుక్కుని, నాటకీయంగా ఎతకడానికి అలవాటు పడిపోయారు. ఏడుపు, నవ్వు, మాటలు, చేతలు అన్నీ అసహజంగా ఉంటాయి....."

తల అడ్డంగా ఊపాను.

"కాదు... గీత... నాది అలాంటిది కాదు... మా వాళ్ళు అమెరికా

అల్లుడు కావాలన్న మోజులో కొన్నింటిని మర్చిపోయారు. అందులో సురేంద్రని గురించి పూర్తిగా తెలుసుకోకపోవడం....."

"చాలామంది విషయంలో... యించు మించుగా యిలాంటివే జరిగాయి... అవన్నీ వదిలెయ్యి... ముందు ఏం చెయ్యాలో ఆలోచిద్దాం... ఎవరి జీవితం వాళ్ళే బాగు చేసుకావాలి. అది జరగకపోతే, మనసులో చైతన్యం ఉండదు. చైతన్యం లేకపోతే ఆలోచనలుండవు. అది జరగలేదనుకో, నీ అస్తిత్వం ఆగిపోయినట్లే అదిగో... అక్కడి నుంచే... అశాంతి మొదలవుతుంది.

ఏదో ఓ యావోగేషన్ పెట్టుకో... పుస్తకాలు చదువు... పాటలు పాడుకో... నువ్వు యిక్కడి జీవితానికి మెల్ల మెల్లగా అలవాటు పడిపోతావు. అప్పుడు పరుగుల జీవితం మొదలవుతుంది. అందులో ఆనందం ఉంది. అభద్రత ఉంది. వాస్తవాన్ని భరించలేము. కలలు కనకుండా ఉండలేము. అయినా ఆలోచించడానికి సమయం కూడా ఉండదు. రోజులు గడుస్తున్న కొద్దీ పరిష్కారాలు వాటంతట అవే దొరుకుతాయి..."

ఒక్కసారిగా ఏడ్చేసాను.

"లేదు గీత... నా దానికి పరిష్కారం అంత సులభంగా లేదు. తనకి కావల్సింది డబ్బు. అది నాన్నగారిని అడిగి తేవడం. నా జీవితం ఇప్పుడు సురేంద్ర పెట్టిన ఆర్థిక బిల్లుతో ముడి పడి ఉంది. మాది ఏడడుగుల బంధం కాదు, నైతిక సూత్రాల మీద నడవడం లేదు. ఆర్థిక సూత్రాల మీద ఒడిదుడుకులతో నడుస్తోంది... ఏం పెళ్ళో ఏమో..."

నన్ను ఓదార్చలేదు. ఊరడించలేదు. ఆలోచనలో ఉండిపోయింది.

"ఇక్కడ చాలా మంది జీవితాలు అంతే... ఏదో ఒక స్వార్థంతో ముడి వేసుకుని ఉన్నవే.

ఓ పెళ్ళి అయ్యాక, ఆ భార్యాభర్తలు అన్ని విధాలుగా అంటే ఇంటలెక్చ్యువల్‌గా, ఫిజికల్‌గా, ఇమోషనల్‌గా, ఆర్థికంగా, ఫ్రీక్వెన్సీ కలిస్తేనే మేడ్ ఫర్ ఈచ్ అదర్ అనచ్చు. కానీ... విషాదం యిక్కడే ఉంది. అందుకే

ఎక్కడో అక్కడ సద్దుకు పోవడంతో జీవితాలు గడిచిపోతున్నాయి. ఎదురు తిరిగి, జీవితాన్ని కూలదోసుకోడం, లేదా విడాకులు తీసుకోడం వరకూ రాకూడదనే అంత అనుకుంటారు.

ఈ పరిస్థితి గుడిసెల్లో ఉండే వాళ్ళకయినా, మేడలో ఉండే వాళ్ళకయినా, చదువున్నా లేకపోయినా, పల్లె అయిన పట్నం అయినా సరే..... అందరిదీ ఎక్కడో ఒకచోట నిశ్శబ్ద పోరాటమే ఇందులో అబద్ధం లేదు.

ఇందులో ఫెమినిజం లేదు. లింగ వివక్షత. ఇదంత అరణ్య న్యాయం. శతాబ్దం ఏదైనా, దేశం ఏదైనా, ఖండం ఏదైనా, స్థితి ఒకటే......

ఈ ఆడవాళ్ళంతా విక్టింస్ కాదు. సర్వైవర్స్.

నువ్వు, సురేంద్ర విడిపోవాలని నేను కోరుకోను. మొగుడు పెళ్ళాలు విడిపోతే నష్టం ఏమీ లేదు. దాని ప్రభావం సమాజం మీద పెద్దగా ఉండదు. మనసు మీద కూడా ఉన్నా... అది తాత్కాలికం.

కానీ, తల్లిదండ్రులు విడిపోతే...... పిల్లలు నష్టపోతారు. వారి అమూల్యమైన జీవితం పోతుంది. పెద్దవాళ్ళ గొడవల మధ్య నలిగిపోతారు. మానసిక రోగులు అవుతారు.

అందుకే, సమాజం, కుటుంబం, సంఘసేవకులు, మానసిక నిపుణులు కొంచెం సద్దుకుపోవాలని అంటారు.

వెళ్ళు డబ్బు తెచ్చిచ్చెయ్యి. ఉద్యోగం కూడా లేదంటున్నావు కదా! ఉద్యోగం వచ్చిందనుకో సురేంద్ర ప్రవర్తనలో మార్పు ఉంటుంది. మంచిగా అయిపోతాడు. యింకో ఏడాది పోయాక నువ్వు ఉద్యోగం చెయ్యగలవు అప్పుడింక గొడవలే ఉండవు."

"ఏమో గీతా! సురేంద్ర మీద నమ్మకం కుదరడం లేదు. అదెవరో ఏన్సీట. షికాగోలో ఉద్యోగం యిప్పిస్తానందిరుట..."

ఆశ్చర్యంగా చూసింది గీత.

"ఏన్సీయా! ఉద్యోగం యిప్పిస్తానంటోదా! వాళ్ళ పరిచయం ఎలాంటిది!

నీ కెలాంటిదిగా అనిపిస్తోంది!"

"నా పెళ్ళికి ముందునుంచే ఉందనుకుంటా...... కానీ, వాళ్ళిద్దరి బంధాన్ని నేనూహించడం లేదు... నా మనసంగీకరించడం లేదు..."

"అమెరికాలో గ్రీన్ కార్డుకోసమో, డబ్బుకోసమో చాలా మంది నీగ్రో యువతులతోనో, తెల్ల దొరసానులతోనూ ఉంటుంటారు. సురేంద్ర కూడా అంతే కావచ్చు. ముందు నువ్వెళ్ళిపో... ఇక్కడుంటే నీకూ, నీ కడుపులోని పిల్లకి మంచిది కాదు. అన్నివిధాలుగా సుఖం, శాంతి. నీకక్కడే దొరుకుతాయి. డబ్బు తీసుకుని వచ్చాక, నీకు ఇక్కడ ఉద్యోగం, దొరికాకా, అప్పుడు ఆలోచించవచ్చు పరిస్థితిని బట్టి సురేంద్రతో ఉండడమో, విడిపోవడమో...

మెల్లగా తల ఉపాను.

గీత యిచ్చిన మానసిక బలంతో ఓ మూడు వారాలు నిర్వికారంగా నన్ను కానట్టుగా, గడిపాను. ఆ తర్వాత, నిశ్శబ్దంగా, తన మానానా తాను వెళ్ళిపోయే గోదావరి ఒడ్డునున్న మా ఊరు చేరుకున్నాను.

మరో నాలుగు రోజులకి సురేంద్ర ఫోన్ చేసాడు.

"నేను, షికాగోలో ఉంటున్నాను. ఎందుకని అడగద్దు. శాన్ ఫ్రాన్సిస్కోలో ఉద్యోగం నువ్వున్నప్పుడే పోయింది. ఆ సంగతి నీకు తెలుసు. పొలం బేరం పెట్టారా! నాకు డబ్బు చాలా అవసరం..."

ఇలాగే ఉంటుందా ఇతని సంభాషణ! నా గురించి ఒక్క మాటయిన అడగలేదు. ఆరోగ్యం ఎలా ఉంది. డాక్టరు దగ్గరికెళ్ళావా! దుఃఖం గుండెల్లోంచి తన్నుకొచ్చింది.

"ఇంకా యింట్లో చెప్పలేదు. సమయం కోసం చూస్తున్నాను..."

"నీ యిష్టం... ఎప్పుడు చెప్తావో... చెప్పు... కానీ, డబ్బు లేకుండా మాత్రం యిక్కడికి రాకు..." లైన్‌కట్ అయింది.

పరిస్థితి గురించి, నాన్నతో చెప్పే చనువు లేదు.

అమ్మతో చర్చించేంత ధైర్యం లేదు.

రోజులు గడిచి పోతున్నాయి. మళ్ళా నేను అమెరికా వెళ్తానన్న ఆశపోతోంది.

ఈ జాప్యం చేస్తూ గడిపేస్తున్నాను.

ఇంతలోనే వర్షాలు... యిలా స్కూల్లో తలదాచుకోడం...

ఇంతలో సూరమ్మత్తయ్య నా పక్కన నుంచుంది.

"అమ్మడూ, ఎలా ఉంటోంది? ఇప్పుడే హెలికాప్టర్లలో పులిహార పాకెట్లు, మంచి నీళ్ళ పాకెట్లు పడేసారు. మీ అమ్మ వెళ్ళింది... ఏదైనా ఓ పాకెట్టు దొరికితే కొంత తిందువుకాని." అంటూ నా తల నిమిరింది. బుగ్గలు పుణికింది.

" చిక్కిపోయావు... మొగపిల్లాడు పుడ్తాడెమో... మీ ఊరెళ్ళకా, మామూలుగ అవుతావులే.....

నువ్వు కల్లో కూడా అనుకొని ఉండవు, యిలా వరదల్లో, యిల్లు వాకిలి వదిలేసి, ఓ స్కూల్లో తలదాల్చుకుంటావని... వేదాంతాన్ని, వైరాగ్యాన్ని మర్చిపోకూడదని, దేవుడు మధ్య మధ్యలో యిలా మొట్టికాయలు వేస్తూంటాడు... అంతెనా ... నే చెప్పింది రైటేనా! అమెరికా వాళ్ళు మీ అంత తెలివి మాకుండదనుకో..."

నవ్వాను. అందులోని వెలితిని గ్రహించే స్థితిలో ఆమె లేదు. ఇంతలో అమ్మ ఓ పులిహార పాకెట్టు, మంచినీళ్ళ పాకెట్టు పట్టుకుని వచ్చింది.

"శ్రావ్యా! దా... యిలా ఈ టేబుల్ దగ్గర కూచుని తినేసెయ్యి." అంటే, లేచి టేబుల్ దగ్గరున్న కుర్చీలో కూచున్నాను.

"జాగ్రత్త మిరపకాయలూ అవీ చూసుకోని... తినెసెయ్యి..." అంటూ అమ్మ నా పక్కనే కూచుంది.

"ఎన్నో చేసి నీకు పెడ్దామనుకున్నాను. మన ఖర్మ... ఇదిగో యిలా పులిహార పెట్టాల్సి వచ్చింది....." అంది కళ్ళ నీళ్ళు పెట్టుకుంటూ......

"పర్వాలేదమ్మా... ఇంటికెళ్ళాకా అన్ని రకాలు చేసి పెట్టు... నువ్వు కూడా తిను..." అంటూ అమ్మకేసి చూసాను.

"వొద్దే... నాకు వారం ఉంది. అయినా ఇలా పొచి కూడు నేను తినను......

"అల్లుడిగారికి ఫోన్ చేసావా! చెయ్యి... ఓ సారి చేసావనుక్కో అతను కూడా కంగారు పడరు... ఏం... రవణమ్మ జారి పడిందిట, ఎలా ఉందో చూసొస్తాను. ఫోన్ చేసాక కాస్త నడుం వాల్చు." అనీ అమ్మ వెళ్ళింది.

పరిస్థితి వివరిస్తే సురేంద్ర అర్ధం చేసుకుంటాడేమో అన్న ఆశ ఏ మూల నుంచో కలుగుతోంది.

అమ్మ అలా వెళ్ళగానే కిటికీ దగ్గరకెళ్ళి ఫోన్ చేసాను. చాలా సేపటికి లైన్లోకి వచ్చాడు. వెంటనే కట్ చేసాడు.

ఏదో చెప్దామనుకున్నాను. చెప్పలేదు. మనసులోది చెప్పకుండానే లైన్ కట్ చేస్తే ఎలా! ఎక్కడో అభిమానం దెబ్బతింది ఏదో ఆవేశం.

మళ్ళా చేసాను.

"ఏం కావాలి? మళ్ళా ఎందుకు ఫోన్ చేసావ్?" మాటలో కరుకుదనం.

కళ్ళంబడి నీళ్ళు గొంతులోంచి మాట రావడం కష్టం అవుతోంది.

"సరే... ఎలాగూ ఫోన్ చేసావు... కాబట్టి, ఇద్దరం... కొంచెం మన భవిష్యత్తు గురించి మాట్లాడుకుందాం... నా భవిష్యత్తు నేను నిర్ణయించుకున్నాను..." కంఠంలో యిదివరకటి కరకుదనం లేదు. కానీ, మాటల్లోని ప్రతీ అక్షరం నిశబ్ధంగా బాంబుల్ని వేసాయి.

నా నోట మాట రాలేదు. సురేంద్ర కూడా మౌనంగా ఉండిపోయాడు.

"అంటే... మరి నాది... నేనేం చెయ్యాలి! నేనేం కావాలి?"

నిస్సహాయంగా , అయోమయంగా అడిగాను.

సురేంద్ర ఏం మాట్లాడలేదు. దాంతో కొంచెం ధైర్యం వచ్చింది.

"అదేంటీ, మీా భవిష్యత్తు అని అలా నన్ను వేరు చేసారు. ఇక్కడి పరిస్థితి బాగా లేదు. పొలం అమ్మమని చెప్పడానికి నాకు నోరు రావడం లేదు. ఇక్కడ వర్షాలు, వరదలు. నేను వచ్చేస్తాను. వాళ్ళ మీాద బరువుగా

ఉండటం నాకిష్టం లేదు... ఎలా అయినా టిక్కెట్టుపంపండి... నే వస్తాను..."

"స్టాప్... అక్కడితో ఆగు... నువ్వు రావక్కర్లేదు. నేను నిన్ను పోషించే స్థితిలో లేను. నాకుద్యోగం లేదు. ఆ సంగతి నీకు తెలుసు కదా!

ఆమెకు షికాగోలో ఉద్యోగం వచ్చింది. నా బతుకు తెరువు నేను చూసుకోవాలి కదా మరి. నా సర్వైవల్ కోసం నేను ఆమెతో ఉంటున్నాను. నాకు డబ్బు కావాలి. ఆమె యిస్తోంది. ఆమెకో యిల్లుంది. అందులో నాకు నీడనిచ్చింది. ముఖ్యంగా ఆమెకు గ్రీన్ కార్డుంది. మా యిద్దరివీ కన్వీనియన్స్ బతుకులు ఒకళ్ళ అవసరం మరొకళ్ళకి ఉంది. నీకు వివరంగా చెప్పాల్సిన పనిలేదు. నీకు అర్థం అయిందనుకుంటాను. ఇప్పటినుంచి నా భవిష్యత్తు వేరేదారిలో వెడుతుంది. దానిలోకి నువ్వు కానీ, నీ ఛాయలు కానీ ఉండవు. ఉండడానికి వీలులేదు. యింక గొడవ చెయ్యకు... అక్కడే ఉండిపో......."

కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి.

"డబ్బు తెస్తే... నాకిస్తే... మనం కలిసి ఉండచ్చు... లేదా......"

"నేను కోర్టు కెళ్తాను... నా కడుపులో నీ బిడ్డ ఉన్నాడు... ఆ సంగతి నీకు బాగా తెలుసనుకుంటాను......" మొండిగా అన్నాను.

"యింక మనం విడాకులు తీసుకోలేదు... కోర్టుల సంగతి తర్వాత... అయినా విడాకులు యివ్వడం నాకిష్టం లేదు... ఇలాగే గడిపేద్దాం... నువ్వక్కడ నేనిక్కడ..." లైన్ కట్ అయింది.

ఒక్కసారిగా కళ్ళు తిరిగాయి.

అలాగే కళ్ళు మూసుకున్నాను. కానీ, ఎక్కడో లోయలోకి వెళ్ళిపోతున్నట్లుగా అనిపించింది.

కడుపులో బాధ... ఏదో గట్టిగా తగిలింది. టేబుల్ తగిలి ఆ తర్వాత కుర్చీ కోడు, ఆ తర్వాత కింద పడిపోయాను. "అమ్మా' అన్న అరుపు నాదో, లోపలున్న ప్రాణిదో తెలీలేదు. నొప్పి.....

"అయ్యో..... అయ్యో...... పిల్ల పడిపోయిందే..." అంటూ పక్కనే

ఎవరితోనో మాట్లాడుతున్నా అమ్మ నన్ను పట్టుకుంది.

"శ్రావ్యా!... ఏఁవయింది... అలా పడిపోయావేంటీ?... కళ్ళు తెరిచి ఓసారి అమ్మని చూసి మళ్ళా కళ్ళు మూసుకున్నాను. ఈ లోపల ఎవరో యిద్దరు వాలంటీర్లు మంచినీళ్ళ పాకెట్లతో వచ్చారు. నొప్పితగ్గడం లేదు... బాధతో మూలుగుతున్నాను.

"ఓ సారి, డాక్టరు గారికి చూపిస్తే నయం......"

"ఉండండి... డాక్టరున్నారేమో చూసొస్తాం..." అంటూ వాళ్ళు వెళ్ళిపోయారు.

ఒక్కసారిగా అమ్మ రాగం పెట్టింది.

"పువ్వులాంటి పిల్ల... ఎలా వాడిపోయిందో... ఈ వానేఁవిటో? ఇక్కడ స్కూల్లో ఉండడం ఏఁవిటో? నేనేం చెయ్యనురా దేవుడా! ఆయనేమో యిల్లుని చూసుకుంటానంటూ డాబా మీద కాలక్షేపం చేస్తున్నారు...... నేనొక్కదాన్ని అయిపోయాను దేవుడా! ఆడదాన్ని ఏం చేయగలను దేవుడో....."

"వదినా! ఊర్కో... మేఁవంతా లేమా! దాని ముందు అలా రాగాలు పెడ్తే, అది బెంబేలు పడిపోదూ... యిక్కడ యింత మంది ఉన్నాం... నువ్వొక్కదానివి అని అనకు. శ్రావ్య మన పిల్ల... మేఁవంతా ఉన్నాం... పైన దేవుడున్నాడు... అన్నింటికీ రాగం మంచిది కాదు... ఏం జరిగినా మన మంచికే... ఎలా రాసి ఉంటే అలా జరుగుతుంది. కంగారు పడుతుదాన్ని కంగారు పెట్టకు......" అంది సూరమ్మత్తయ్య.

ఎవరో ఇద్దరు వచ్చారు. నా దగ్గరికొచ్చి నన్ను చూసారు.

"లేడీస్ ప్రాబ్లెంలాగా ఉంది... ఓ సిస్టర్ ఉంది... ఆమెను పంపుతాం... మేం డాక్టర్లం కాదు. కదా, అందుకని పరీక్షలు అవీ మేం చేయలేము. ఫస్ట్ ఎయిడ్ చేస్తాం... ఇంజక్షన్‌లు అవీ యిస్తాం... ఇప్పుడు ఈమెకి మా అవసరం లేదు..."

అంటూ వాళ్ళెళ్ళి పోయారు.

నొప్పి... కింద నుంచి ఏదో కారుతున్నట్లుగా అనిపించింది. సైగ చేసి అమ్మని పిలిచి, చెవులో చెప్పాను.

అమ్మ భయంగా, చీరని చూసి... "అయ్యో నా తల్లీ..."

అంటూ అరిచింది.

ఇంత ఓ సిస్టర్, ఓ చిన్నకిట్ తీసుకుని వచ్చింది. ఆమె చాలా చిన్నగా ఉంది.

"ఎన్నో నెల..." అంది నన్ను, నా పొట్టని చూస్తూ.

"ఆరు..." అన్నాను మెల్లిగా.......

"తొందరగా ఆస్పత్రికెళ్ళితే నయం... బ్లీడింగ్ బాగా అవుతోంది......"

అంటూ లేచింది ఆమె......

"ఒక్క పావుగంట ఆగండి నేను ఏదో ఒకటి అరేంజ్ చెయ్యడానికి ప్రయత్నిస్తాను......" అంటూ వెళ్ళి పోయింది.

"అమ్మ... జార్త...జార్తగా పడుక్కో.. కాళ్ళు యిలా పెట్టు..."

ఎవరో ఏదో అంటూ నా కాళ్ళని కొంచెం ఎడంగా పెట్టారు.

"అమలాపురం పెద్దాసుపత్రికి ఫోన్ చేసాం... అంబులెన్స్ పంపుతున్నారు..." అని ఒకరన్నారు.

"అంబులెన్స్ లేదుట... ఎలాగో లారీలో తీసుకురమ్మన్నారు." ఆ తర్వాత అన్ని పనులు చకచకా అయిపోయాయి.

ఓ బెంచిమీద నన్ను పడుక్కో పెట్టి, దానితో సహా లారీలో ఎక్కించారు. నాలుగు చీరలు వేసి, పల్చటి, మెత్తటి పక్కని చేసారు.

నొప్పి... అంతకంతకూ ఎక్కువవుతోంది. నా మీద నీళ్ళు పడకుండా, ఓ టార్పాలిన్ని నలుగురు పట్టుకున్నారు.

మరో గంటకి అమలాపురం ఆసుపత్రికెళ్ళాం. ఇక్కడంత వర్షాలే కానీ, రోడ్లమీద, వీధుల్లోనూ పొంగి పొర్లి పోవడం లేదు.

అందుకే వర్షాలున్నా, జన జీవనంలో చైతన్యం ఆగిపోలేదు. ఏదో ఇంజక్షన్ యిచ్చారు. "రెస్ట్ తీసుకోండి... లేడి డాక్టరు వచ్చాక మిమ్మల్ని పరీక్ష చేస్తారు..." అంటూ నర్స్ వెళ్ళిపోయింది.

ఆసుపత్రిలో పడుకున్నాక కొంచెం తేలిగ్గా అనిపించింది. నాకు

"శ్రావ్యా! అల్లుడిగారికి ఫోన్ చెయ్యి....."

తలూపాను. కానీ చెయ్యడానికి జంకాను. యిక్కడంత పగలు . అక్కడేమో అర్థరాత్రి ఎలా లేపి, ఏం చెప్పాలి అని ఆలోచించాను.

సెల్ తీసుకుని చూసాను. డబ్బు యింకా ఉంది. చాలాసార్లు మాట్లాడచ్చు.

అమ్మ, నరమ్మత్తయ్య కిటికీ దగ్గర నుంచుని ఏదో మాట్లాడుకుంటున్నారు.

సెల్ తీసి నంబర్‌లు నొక్కను.

"నిద్రపోతున్నాను. డిస్టర్బ్ చెయ్యకూడదని తెలీదా! నీకు పగలయితే నాకూ పగలేనా! నేను పడుకోనక్కర్లేదా!....."

ఏం అనాలో తెలీలేదు. అమ్మ నా వైపే చూస్తొంది.

"నాకు నొప్పులొస్తూంటే, అమలాపురం ఆస్పత్రికి తీసుకొచ్చారు."

"మంచిది... శుభవార్త చెప్పావు కదా... పెట్టెయి... నీ డెలివరీకి దానికి డబ్బు పంపుతానని అనుకోకు. నాకేం ఉద్యోగం లేదు. యింక ఫోన్ చెయ్యకు... నన్ను విసిగించకు..."

అంటూ లైన్ కట్ చేసాడు.

నా మొహంలోని మార్పులు గమనించినట్లుంది. అమ్మ గబగబా వచ్చింది.

ఒక్కసారి అమ్మని పట్టుకుని ఏడ్చేసాను. కొంచెం కొంచెంగా అన్నీ చెప్పాను.

"ఏదో అమెరికా వాడు కావాలనుకున్నాం, కానీ, యిలాంటి వాడు కావాలని అనుకోలేదు. నిండ పాతికేళ్ళు లేవు... నీ జీవితాన్ని నాశనం చేస్తున్నాడే..." అని కళ్ళు తుడుచుకుంది.

"ఇదిగో... ఈ ప్రళయం తగ్గనీ, నీ ఎకరం అమ్మేయ్యమని మీా నాన్నగారికి చెప్తాను. డబ్బు తీసుకెళ్ళిపోదువు..."

మత్తుగా తలూపాను.

ఆ రాత్రికి నొప్పులు ఎక్కువయ్యాయి. నాకర్థం అయిపోయింది. ఓ జీవీ లోపల్నించి బయటికి రావడానికి చేస్తున్న యుద్ధం. నిజానికిది స్వేచ్ఛా ప్రపంచమేనా! బంధాల్లేవా! పాశాల్లేవా!

తప్పని సరిపరిస్థితిలో, నా ప్రాణానికే ముప్పు అని కడుపుకోసారు. పేగుకోసారు.

ఓ చిన్న జీవి అరచెయ్యంత జీవి, ఈ విశాల ప్రపంచంలోకి వచ్చాడు.

ఈ అమలాపురం రాకపోతే... కడుపులోనే సమాధి కావలసినవాడు. కానీ అలా అవలేదు ఏదో ఆశతో వచ్చాడు. ఈ మాయా ప్రపంచంలోకి, ఈ లోకం లోకి అడుగు పెట్టినప్పట్నించి పోరాటమే. జీవిచండానికి ఆరాటమే.

అమ్మ అయినవిల్లకి ఫోన్ చేసింది. అమలాపురం ఆస్పత్రి అడ్రస్సు అదీ యిచ్చింది.

వర్షం తగ్గింది. వరద ఉధృత తగ్గింది. యిళ్ళల్లోకి వచ్చిన నీరు వెళ్ళిపోయాయని అమ్మ చెప్పింది.

నాన్నగారు, జగన్నాధం మామయ్యని తీసుకుని పొద్దున్నకి వచ్చారు.

"చంటి వాడి పరిస్థితి ఏం బాగ లేదుట. వాడిని, ఆప్రేషన్ థియేటర్‌కి తీసుకెళ్ళారు....."

"సిస్టర్..." నేనున్న దగ్గరికి వచ్చిన సిస్టర్‌ని పిలిచాను.

"హోప్ లేదు... ఇన్‌క్యుబేటర్‌లో ఉంచుతాం... ఏదో మా ప్రయత్నం

మేం చేస్తున్నాం..."

"నన్నొక్కసారి బాబు దగ్గరికి తీసుకెళ్ళండి. ఓసారి బుగ్గలు నిమురుతాను. ఓ చిన్న ప్రశ్నని అడుగుతాను. నాకే ఎందుకుపుట్టావ్?

ఆమె నా వైపు జాలిగా చూసింది.

నాకు బట్టలు మార్చింది. అమ్మ, సిస్టర్, సాయంగా, బాబు ఉన్న గదిలోకి వెళ్ళాను.

పెళ్ళి అంటే కడుపు రావడం అన్నది మటుక్కే నాకు తెలిసిన అర్థం. తనుపోరాడి, పోరాడి ఈ భూమ్మీదకి వచ్చావు. జీవితం కొనసాగాలా వద్దా అన్నదానికి కూడా పోరాటమేనా!

"బతకడం కష్టం..."

ప్రాణం ఉన్న ఈ జీవి, ఏ క్షణంలోనైనా న్యూట్రల్ జండర్‌లోకి మారిపోవచ్చు.

అప్పుడు ఏంవవుతుంది?

నా మంచం మీద పడుకున్నాను.

"ఏంవవుతుంది? చిన్న బాబుకి ఏంవయినా అయితే... ఏంవవుతుంది?

స్వేచ్ఛ బాబుకి స్వేచ్ఛ.

మా యిద్దరి మధ్య దెబ్బలాటలు, కోర్టు గొడవలు... వీటి మధ్య నలిగిపోకుండా, దేవుడు న్యాయం చేస్తూ వాడికి స్వేచ్ఛ నిస్తున్నాడు.

కష్టాలనుంచి, చేదు గతం నుంచి, మానసిక వ్యధల నుంచి స్వేచ్ఛ.

చట్టరిత్యా, నాకు స్వేచ్ఛ. ఈ పెళ్ళి బంధం నుంచి స్వేచ్ఛ.

"సారీ... బాబుని బతికించలేకపోయాం... ఫార్మాలిటీస్ అయ్యాక మీకిస్తాం......"

అమ్మ ఘొల్లుమంది నాన్నగారిని, జగన్నాథం మామయ్య పట్టుకున్నారు.

అచేతనంగా ఉండిపోయాను. ఏం జరుగుతోందో ఏం తెలీడం లేదు.

కానీ, కార్యక్రమాలన్నీ జరిగిపోతున్నాయి.

లోపల్నించి ఏదో కోపం, ఏదో కసి -

సురేంద్రకి ఫోన్ చేసాను.

"ఫోన్ చెయ్యద్దన్నాను! ఎందుకు చేసావ్? ఒకసారి చెప్తే అర్థంకాదా!"

గుండెని చిక్కబట్టుకున్నాను.

"నీకు గుడ్ న్యూస్ చెప్దామని, దేశం అంతా అరవయ్యో స్వాతంత్ర్యదినోత్సవం జరుపుకుంటుంటే, మనకి కూడా స్వతంత్రం వచ్చిందని చెప్పడానికి ఫోన్ చేసాను. నువ్వు ఫ్రీ... నీకు స్వేచ్ఛ... నీకు అబ్సల్యూట్ ఫ్రీడం....."

"షడాప్... ఏం జరిగిందో చెప్పకుండా, ఈ సోది దేనికీ?"

"మన మధ్య ఉన్న లింక్, అదే బాబు వల్ల వచ్చినది యిప్పుడే తెగింది నీలాంటి అవకాశావాది నుంచి, రాక్షసుడి నుంచి నాకు స్వేచ్ఛ... నా నుంచి నీకు స్వేచ్ఛ... మన గొడవల నుండి బాబుకి స్వేచ్ఛ... బాబు మరణం, మనకి స్వేచ్ఛ, పేరడాక్స్ కాదా!

ఈ జన్మలో మనం ఒకళ్ళ నొకళ్ళు చూసుకోవాల్సిన పని లేదు. నా ప్రెగ్నెన్సీ వల్ల, నీతో జీవితం ఎలాంటిదయిన ఎలాగో ఓ లాగ గడపడానికి నిశ్చయించుకున్నాను. ఇప్పుడది లేదు. బాబే లేనప్పుడు మన మధ్య సంబంధం ఉండాల్సిన పనిలేదు. అతిహీనంగా, అవమానంతో బతకాల్సిన పనిలేదు. జీవన మమకారాన్ని వదులుకోలేక, బ్రతుకు పోరు ప్రారంభించాను. నా హృదయ సౌకుమార్యాన్ని నలిపేసావు... నాకిలాంటి బానిసత్వపు బతుకక్కర్లేదు..." జారుతున్న కన్నీళ్ళని తుడుచుకోడానికి ప్రయత్నించలేదు.

చదువుకున్న దాన్ని నా జీవితాన్ని నేను దిద్దుకోగలను. సురేంద్రలాగా అనైతికంగా కాదు గ్రేస్‌గా... హుందాగా......

జీవితంతో పోరాడలేక బాబు అలిసి, పై లోకాలకెళ్ళాడు. కానీ, నేను అలాకాదు. నరాల్ని చీల్చేసిన అనుభవాలు నాలో ఉన్నాయి. చీకట్లోంచి, గోతుల్లోంచి, భవిష్యత్తు ఎలాంటిదయినా ప్రయాణించగలను. నా జీవశక్తి ఆగలేదు. ఆ శక్తితో, అమెరికాలో ఉన్న సురేంద్రని నిర్వీర్యుడిని చెయ్యగలను జైలుకి పంపగలను. ఆ శక్తిని చచ్చిపోయిన చిన్నవాడు నాకందించి వెళ్ళాడు.

(సుజన రంజని డిసెంబరు 2007)